# ఘెరావ్

మూలకథ రచయిత: పంకజ్ సుబీర్
అనువాదం: ఆర్. శాంతసుందరి

**అది** అంత హంగామా చెయ్యదగిన సంఘటనేమీ కాదు. ఊళ్ళోని ఆవారా కుర్రాళ్ళు స్కూలునుంచి వస్తున్న ఇద్దరు అమ్మాయిల్ని రోజూ వెంటపడి ఏడిపించేవాళ్లు. ఆ ఆడపిల్లలకి మగదిక్కు లేకపోవటం ఒక సమస్య. తండ్రి ఉద్యోగం ఇచ్చారు. ఇంట్లో ఉండేది తల్లీ, ఇద్దరు కూతుళ్ళూ. ఆ ఇద్దరమ్మాయిలూ, మాట్లాడకుండా తల వంచుకుని, ఆ కుర్రాళ్ళు పెట్టే బాధని సహిస్తూ ఇంటికి చేరేవాళ్లు.




ఒకసారి స్కూలు ప్రిన్సిపల్‌కి రిపోర్టు చేశారు. ఆ ప్రిన్సిపల్ ఈ విషయం పోలీసులకి చెప్పి, కంప్లెయింట్ నమోదు చేయించింది. కానీ ఆ పోలీసులు వచ్చి ఈ పిల్లల్ని అడిగిన ప్రశ్నలు విన్నాక, ఇక మళ్ళీ పోలీసులకి చెప్పటానికి వాళ్ళకి ధైర్యం సరిపోలేదు. ఈ విషయం తెలిశాక ఆ కుర్రవాళ్ళు చేసే అల్లరి బాగా మితిమీరిపోయింది. ఆ పిల్లలు పక్కనించి వేగంగా బైక్ నడపటం, చున్నీలు లాగటం లాంటివి మొదలు పెట్టారు.

ఇక జరిగిన సంఘటన కొద్దాం. ఈ ఆడపిల్లల్ని అల్లరి పెట్టింది ఎవరో ఒక కుర్రాడు కాదు, వాళ్ళు గుంపుగా వచ్చి వీళ్ళ వెంట పడేవాళ్ళు. కానీ వాళ్ళల్లో హత్య గావింపబడ్డ కుర్రాడు కొంచెం హద్దు మీరి ప్రవర్తించాడు. ఒక ఆదివారం పొద్దున్నే వాడు ఆ పిల్లల ఇంటి ముందునించి బైక్‌మీద పోతూ, పెద్దపిల్ల ఇంటి ముందున్న దండెంమీద బట్టలు ఆరవెయ్యటం చూశాడు. ఇంక వాడు ఏమీ ఆలోచించకుండా బైక్ ఆపి, ఆ పిల్లవేపు పరిగెత్తాడు. ఏం జరుగుతోందో తెలుసుకునే లోపల వాడు ఆ పిల్లని వాటేసుకుని అందినచోటల్లా ముద్దులు పెట్టేసుకున్నాడు. ఆ తరవాత బైకెక్కి పారిపోయాడు. ఆ పిల్ల ఏడుస్తూ ఇంట్లోకెళ్ళి తల్లికి జరిగినదంతా చెప్పింది. ఆమె కూడా ఈ రోజు కోసమే ఎదురుచూస్తున్నట్టుంది. అల్లరిచేసే కుర్రాళ్ళలో సగం మంది ముస్లిములూ, మిగతా సగం హిందువులు, అందువల్ల ఆమె వాళ్ళని ఏవిధంగానూ ఎదుర్కోలేకపోయింది. కానీ ఈ రోజు ఈ సాహసం చేసిన వాడు ముస్లిమ్, ఆ పిల్ల హిందువు. వాళ్ళు ఉంటున్న ఊరి చరిత్ర చూస్తే, ఈ సంఘటన మందుగుండు ఉన్న కొట్లో చిన్న అగరువత్తి వెలిగించినట్టు, విపరీతమైన పరిణామాలని సృష్టించగలదు!

ఆ పిల్ల తల్లి వీధిలోకొచ్చి గుండెలు బాదుకుంటూ శోకాలు పెట్టసాగింది. చూస్తుండగానే జనం పోగయారు. వాళ్ళకి ఆమె అందించిన సమాచారంలో పనిలేని కుర్రాడెవరోవచ్చి నా కూతుర్ని అల్లరిపెట్టి వెళ్ళాడన్న నిజం లేదు. ఒక ముస్లిమ్ కుర్రవాడు హిందువులుండే పేటలోకి వచ్చి హిందువుల అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించి పారిపోయాడని ఆమె వాళ్ళకి చెప్పింది. చేసిన పనికన్నా, వాడు

ముస్లిమ్ అనే విషయాన్ని నొక్కి చెప్పకపోతే వాళ్ళు ఏమీ చేయరని ఆమెకి తెలుసు.

ఆ సంఘటనకి ప్రణాళిక ఎవరు తయారు చేశారో, ఎప్పుడు చేశారో ఎవరికీ తెలీదు. కానీ జర గవలసింది జరిగిపోయింది. వాడు మళ్ళీ రాత్రి ఒక స్నేహితుణ్ణి వెంటబెట్టుకుని ఆ ఇంటికి వచ్చాడు. కానీ ఇరవైనాలుగ్గంటల్లో వాడు శవంగా మిగి లాడు. వాడిప్పుడు ఒక ముస్లిమ్ కుర్రాడుగా పేరుబడ్డాడు. హిందూ మతస్థులకి వాడు ప్రమాద కరంగా కనిపించాడు. కానీ మనం ఒక ప్రశ్న వేసుకో వాల్సి ఉంది, ఆ రోజు రాత్రి ముస్లిమ్ కుర్రాడికి బదులు హిందూ కుర్రాడు ఆ పని చేసి ఉంటే ఏమై ఉండేది?

సరే రాత్రి ఆ అబ్బాయి మళ్ళీ వచ్చి, ఆ పిల్ల ఇంటిముందు బైక్ ఆపీ ఆపగానే, ఎవరో ట్రాన్స్‌ఫా ర్మర్ లోని కటవుట్‌ని తీసేసి, ఆ పేటలో కరెంటు పోగొట్టారు. ఆ తరవాత ఏం జరిగిందో ఎవరికీ తెలీదు. చీకటిగా ఉండటంతో ఏమీ కనబడలేదనే అందరూ అన్నారు. గొడవా, దెబ్బలాటా, కేకలూ, మూలుగులూ, ఎముకలు విరిగిన చప్పుడూ, ఇవే పది పదిహేను నిమిషాలపాటు కొనసాగాయి. ఆ తరవాత ఎవరో పరిగెత్తుతున్న చప్పుడయి, అంతటా నిశ్శబ్దం అలుముకుంది. చాలా సేపు నిశ్శబ్దం తాండవించిన తరవాత పోలీస్‌కారు సైరన్ వినిపించింది. ఆ సంఘటనకి ముఖ్యపాత్ర వహించి నవాడు అక్కడే హతం అయిపోయాడు. వాడి స్నేహితుడికి ఊపిరి ఇంకా ఆడుతూనే ఉంది. కానీ వాడికి కూడా చావు రాసిపెట్టి ఉండటంతో, మర్నాడు పొద్దుటికల్లా వాడూ చనిపోయాడు.

నిజానికి అంతటితో ఆ విషయం ముగిసిపోవల సింది. కానీ ఆ తరవాతే అది వేగాన్ని పుంజుకుంది. ఇద్దరు కుర్రాళ్ళూ చనిపోయాక, వాళ్ళు ముస్లిము లనే వాస్తవం జనం మనసుల్లో ఇంకా బలంగా నాటుకుంది. ఇటు హిందువులకే కాక అటు ముస్లి ములకి కూడా అలా అనిపించటం విశేషం. సన్నీ అనే పదమూడేళ్ళ కుర్రాడు, తన తండ్రి పనిచేసే మోటార్‌సైకిల్ షోరూములోంచి సైలెన్సర్ ఎత్తు కొచ్చి, ఆ కుర్రాళ్ళిద్దరి తలకాయలూ బద్దలు కొట్టా డని ఎవరో అన్నారు. ఆ అక్క చెల్లెళ్ళిద్దర్లోనూ చిన్న పిల్లకీ వాడికీ సంబంధం ఉందని ఇంకోరన్నారు. పదమూడేళ్ళ గుంటడికి ప్రేమా దోమా ఏమిటని కొందరు దాన్ని ఉత్తపుకారుగా భావించారు. చనిపో యినవాళ్ళలో రెండోకుర్రాణ్ణి సన్నీవాళ్ళ నాన్న ఉద్యోగం లోంచి తీసేశాడనీ, దానికి పగతీర్చుకు నేందుకు వాడు చనిపోయేముందు సన్నీ పేరు చెప్పి వాణ్ణి ఇరికించాడనీ కొందరన్నారు.

ఈ చనిపోయిన కుర్రాళ్ళిద్దరూ పక్కపక్క ఇళ్ళలో ఉండేవారు. వాళ్ళ శవాలు ఇంటికి చేరేసరికి ఆ పేటలోని జనం రోడ్డుమీదికొచ్చి నినాదాలు చెయ్యసాగారు. ఊళ్ళో ఇంతకుముందు మూడు సార్లు మతకలహాలు జరిగాయి, అందుకని పోలీ సులు వెంటనే రంగంలోకి దిగారు. వాళ్ళ వెనకే విలే కర్లు కూడా వచ్చారు. వాళ్ళలో సమీర్ కూడా ఒకడు. అతను ఒక టీవీ న్యూస్ ఛానల్‌కి స్ట్రింగర్‌గా పనిచేస్తున్నాడు.

ఊళ్ళో ఈ గొడవలు ఎప్పుడు జరిగాయో జనా నికి తెలీలేదు. రాత్రి మామూలుగా పడుకుని పొద్దున్నే నిద్రలేచినవాళ్ళకి ఊళ్ళో ఒకరకమైన ఉద్రి క్తత ఉన్నట్టు అనిపించింది. సూర్యుడు పైకొస్తున్న కొద్దీ మనుషులు రెండు జట్లుగా విడిపోసాగారు హిందువులూ, ముస్లిములూ. పోలీసులు వాళ్ళని మళ్ళీ మనుషులుగా మార్చే ప్రయత్నం చెయ్యసా గారు. కానీ విలేకరులు ఈ మార్పుని హెడ్‌లైన్స్‌గా చాటి చెప్పటంలో మునిగిపోయా రు. సమీర్ తను పని చేసే ఛానల్‌తో మూడుసార్లు ఫోన్‌లో మాట్లా డాడు. మూడుసార్లూ న్యూస్ రీడర్ "ఈ చెప్పండి సమీర్, అక్కడ పరి స్థితి ఎలా ఉంది?" అని అడిగాడు. మూడుసార్లూ సమీర్ ఒకే రకమైన జవాబు చెప్పాడు "ఇక్కడ పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉంది, కానీ ఇంత వరకూ జరగకూడనిది ఏమీ జరగ లేదు. పోలీసులు కూడా అదుపు చేయటానికి ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ అన్ని వైపులా భయాందోళనలు కమ్ముకున్నాయి".

ఢిల్లీలో కూర్చున్న న్యూస్ ఎడి టర్ ఎంతో ఆదుర్దాగా ఏదైనా జర గుతుందా అని ఎదురుచూస్తున్నా డు, కానీ ఇక్కడ ఉన్న ఉద్రిక్త పరి స్థితి సంఘటనని సృష్టించే సూచన లేవీ కనపడలేదు. వార్తల ప్రపంచం లో ఏ రోజుకారోజు కొత్తగా సంచల నాత్మకమైన వార్తలు కావాలి. నిన్న జరిగిన సంఘటన ఎంత ముఖ్యమై నదైనా సరే, ఇవాళ అది పాత పడి పోతుంది.

పోలీసుల ధ్యాసంతా ఆ చనిపో యిన ఇద్దరు కుర్రాళ్ళనీ వీలైనంత త్వరగా పాతిపెట్టాలన్నదానిమీదే ఉంది. శవాలు రాజకీయాలని సృష్టించటానికి ఏ విధంగా పనికివ స్తాయో వాళ్ళకి బాగా తెలుసు. ఆ శవాలు ఇంట్లో ఉన్నంతసేపు ఉద్రిక్త పరిస్థితి అలా కొనసాగుతూనే ఉంటుంది. డి.ఎస్.పి స్వయంగా శవాల్ని కదిలించమని ఆ కుటుంబ సభ్యుల్ని రెండుసార్లు బతిమా లాడు. కానీ వాళ్ళు సన్నీకి విరు ద్ధంగా సెక్షన్ మూడువందల రెండు పెడితేగాని శవాలు కదలవని నిక్క చ్చిగా చెప్పారు. డి.ఎస్.పి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఫోన్లో ఎస్.పీ గద్దింపులకి జవాబు చెపుతూ, ఇంకోపక్క వార్తల ఛానల్స్ వాళ్ళకి సెల్‌ఫోన్‌లో పరి స్థితి వివరిస్తూ, నానా అవస్థపడుతున్నాడు.

పోలీసుల ధ్యాసంతా ఆ చనిపోయిన ఇద్దరు కుర్రాళ్ళనీ వీలైనంత త్వరగా పాతిపెట్టాలన్న దానిమీదే ఉంది. శవాలు రాజకీయా లని సృష్టించటానికి ఏ విధంగా పనికివ స్తాయో వాళ్ళకి బాగా తెలుసు. ఆ శవాలు ఇంట్లో ఉన్నంతసేపు ఉద్రిక్త పరిస్థితి అలా కొన సాగుతూనే ఉంటుంది. డి.ఎస్.పీ స్వయంగా శవాల్ని కదిలించమని ఆ కుటుంబ సభ్యుల్ని రెండుసార్లు బతిమా లాడు. కానీ వాళ్ళు సన్నీకి విరుద్ధంగా సెక్షన్ మూడు వందల రెండు పెడి తేగాని శవాలు కదల వని నిక్కచ్చిగా చెప్పారు.

మధ్యాహ్నం అయినా శవాలు కదలకపోయే సరికి ఎస్.పి. స్వయంగా అక్కడికి రావల్సివచ్చింది. ఎస్.పి. అరవిందకుమార్ బాగా ముదిరిపోయిన డిప్లొమేటే. అతను చనిపోయిన కుర్రాడి కుటుంబా నికి, సన్నీమీద తప్పకుండా కేసు పెడతామని, మాటిచ్చాడు. "ఆ పూచీ నాది, మీరు శవాల్ని త్వరగా కదిలించండి" అన్నాడతను. ఎలాగైతేనేం శవాల్ని శ్మశానానికి కదిలించారు. ఆ శవాల వెంట పెద్ద పోలీసు బలగమూ, తాజా వార్తలు సేకరించి సెల్‌ఫోన్లలో ఎప్పటికప్పుడు వాటిని తెలియజేయ టానికి సిద్ధంగా ఉండే విలేకరులూ బైలుదేరారు.

పోలీసులు మాత్రం అంతా సవ్యంగా జరిగేట్టు చూస్తున్నామనే అనుకున్నారుగాని, జనం గొర్రెల మందలాంటి వారని తెలియనిదెవ రికీ నమాజు తరవాత శవయాత్ర బైలుదేరింది. మసీదు ఎదుటికి వచ్చే సరికి జనంలో అనుకోని మార్పు వచ్చింది. డి.ఎస్.పి. వైర్‌లెస్‌లో తనపై అధికారికి ఇక్కడ ఎటువంటి గొడవలూ జరగటం లేదని చెపు తూనే ఉన్నాడు, అంతలో నాలుగు రోడ్ల కూడలి దగ్గర కొచ్చేసరికి జనం శవాల్ని రోడ్డు మీదకి దించారు. ఇంకే ముంది, వచ్చేపోయే వాహనాల న్నిటినీ వాళ్ళు ఆపెయ్యసాగారు.

ఆ నాలుగు రోడ్లు కూడలి దగ్గరే, రెండు మతాల వాళ్ళుండే పేటలూ వేరవుతాయి. అంటే చచ్చిపోయిన వాళ్ళదీ, చంపినవాళ్ళదీ నినాదాలూ, అలజడీ మొదలైనాయి. దుకాణాల షట్టర్లు దించబడ్డాయి. అంతా గోల గోలగా తయారైంది. ఇళ్ళల్లో తలు పులు బిగించుకుని కూర్చున్న వాళ్ళ ప్రాణాలు బిక్కుబిక్కుమంటున్నా యి. ఛానళ్ళకి పనిచేసే విలేకర్లు గొంతులు చించుకుని, "ఆ అవును ప్రియదర్శన్, ఇక్కడ మేం భయ పడ్డట్టే గొడవలు మొదలైనాయి" అని అరవసాగారు. ఈ విలేకర్లలో సమీర్ కూడా ఉన్నాడు. పదిహేనురో జుల క్రితమే ఢిల్లీ నుంచి స్ట్రింగర్‌గా పనిచేయ్యమని అతనికి ఆర్డర్లు వచ్చాయి.

ఎస్.పి. వచ్చి వాహనాలని ఆపిన వాళ్ళకి నచ్చజెప్పాలని ప్రయ త్నించాడు. కానీ ఆ గుంపు డి.ఎమ్. తో మాట్లాడాలని మొండికేసింది. సన్నీని అరెస్టు చెయ్యాలనీ, చనిపో యిన కుర్రాళ్ళిద్దరికీ చెరి ఐదు లక్షల రూపాయలూ నష్టపరిహారం చెల్లిం చాలనీ వాళ్ళు డిమాండ్ చెయ్యసా గారు. ఎస్.పి. డి.ఎమ్.తో మాట్లా డాడు. కొంతసేపు రానని మొరాయించి, చివరికి ఆమె అక్కడికి వచ్చింది. ఆమెని చూడగానే జనం ఉద్రిక్తులయ్యారు. వాళ్ళ డిమాండ్లని నినాదాలుగా తెలియజేశారు. తనకున్న పరిమిత అధికారంతో అంత నష్టపరిహారం చెల్లించటం కుదరదని, ఆమె వాళ్ళకి క్షమాపణ చెప్పుకుంది. ఎంత వీలైతే అంత తప్పక ఇప్పిస్తానంది. జనం మళ్ళీ సన్నీ మీద సెక్షన్ 302 పెట్టే వరకూ శవాల్ని కదిలించమని గోల చెయ్యసాగారు.


"లేదు సార్! అంత పెద్ద గొడవలేమీ జరగటం

లేదు'' ఎస్. పీ సెల్‌ఫోన్లో ఐ.జీ.తో అంటున్నాడు.

''ఏమీ లేదంటారేమిటి? ఇప్పుడే ఫోన్లో విలేకరి ఫోటోలో చూపిస్తూ, అతను టీవీలో కనిపించారు. పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉందనీ, ఎప్పుడైనా ఏమైనా జరగచ్చని చెప్పాడే?'' ఐ.జి కసురుకున్నాడు'' త్వరగా పరిస్థితి అదుపులో పెట్టి, నాకు రిపోర్టు చెయ్యండి'' అని ఫోను కట్ చేశాడు.

ఎస్.పి. నుదుటి మీద చెమటని తుడుచుకుంటూ, అటుగా వెళ్తున్న సమీర్‌ని ఆపి, ''ప్లీజ్ విషయాన్ని కొంచెం లోప్రొఫైల్‌లో ఉంచండి. మీరు కూడా ఊళ్లో అందరూ బాగుండాలనే కోరుకుంటారు కదా?'' అన్నాడు.

''ఊరు బాగుండాలంటే అది మీ చేతిలోనే ఉంది, ముందీ ట్రాఫిక్ జామ్ గురించి ఏమైనా చెయ్యండి, లేకపోతే పరిస్థితి విషమిస్తుంది'' అన్నాడు సమీర్.




''అది ఎలాగూ చేస్తూనే ఉన్నాం. కానీ చూస్తున్నారు కదా, డి.ఎమ్. మాటల్ని కూడా వీళ్లు వినిపించుకోవటం లేదు'' ఎస్.పి. నచ్చచెపుతున్నట్టుగా అన్నాడు.

''అరవింద్‌గారూ మీరు విలేకర్లని మేనేజ్ చెయ్యటం మానేసి, ముందా జనాన్ని కంట్రోల్ చెయ్యండి. దానివల్ల ఎక్కువ లాభం ఉంటుంది'' అన్నాడు సమీర్. అరవింద్ అతనికేసి కోపంగా చూశాడు.

''ఎస్.పి.గారూ, సన్నీ మీద 302 కేసు పెడతానని వీళ్ళకి హామీ ఇచ్చెయ్యండి. అప్పుడుగాని వీళ్ళు శవాలని కదలనివ్వరు'' అంది డి. ఎమ్. వందన. ఆమె కొంతమంది పెద్దమనుషులతో మాట్లాడి వచ్చింది.

''అలాగే మేడమ్'' అన్నాడు ఎస్.పీ.

తనవెంట వచ్చిన పెద్దమనుషులతో ''పదండి పోలీస్ స్టేషన్‌కి మీరుకూడా రండి, మీ ఎదుటే కేసు నమోదు చేయిస్తాను'' అంది డి.ఎమ్. సౌమ్యంగా.

''మంచిది, మేడమ్'' అన్నాడు వాళ్ళలో ఒకడు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్. పీ. తన చేత్తో సన్నీకి విరుద్ధంగా కేసు నమోదు చేశాడు. వాళ్ళు తృప్తిపడి వెళ్ళిపోయారు. కొద్దిసేపట్లోనే శవాలు కదిలాయి, వాహనాలూ కదిలాయి.

''ఇక్కడ పరిస్థితి సద్దుకుంది. ఎస్.పీ. అరవింద్ కుమార్ ఆ పదమూడేళ్ళ కుర్రాడు, సన్నీమీద హత్యానేరం కిందకేసుపెట్టాడు'' సమీర్ ఫోన్‌లో చెప్తున్నాడు. చెప్పటం అయాక తిరిగి చూసేసరికి ఎస్.పీ. వ్యంగ్యంగా నవ్వుతూ ''ఏం మహాశయా పదమూడేళ్ళ కుర్రాడు అని చెప్పకపోతే ఇది సంచలనాత్మకమైన వార్త అవదుకదూ?'' అన్నాడు.

''ఇందులో సంచలనం ఏముంది, అదే వాస్తవం కదా'' అన్నాడు సమీర్ చిరునవ్వు నవ్వుతూ.

''నేనంటున్నదీ అదే, సమాచారం వాస్తవం అయినా అది సంచలనాత్మకంగా ఉంటేనే మీకు నచ్చుతుంది'' అన్నాడు ఎస్.పీ.

''ఏం చెయ్యమంటారు సార్? మీరూ మేమూ కూడా మంచి విషయాలని ఎంతగా ఇష్టపడినా, వాటిజోలికి పోవటానికి లేదుకదా మనకి ఎదురయ్యే వాస్తవాలన్నీ చెడ్డవే మరి'' అన్నాడు సమీర్.

''సర్లెండి, ఇప్పుడీ మాటలన్నీ అనవసరం. గొడవ ముగిసింది, పరిస్థితి విషమించలేదు, అదే పెద్ద విషయం'' అంటూ డి. ఎమ్ ఇద్దరి మధ్యా కలగజేసుకుంది.

''అయితే ఈ గొడవ ఇంతటితో ముగిసిపోయిందనేనా మీ ఉద్దేశమా?'' సమీర్ గంభీరంగా మొహంపెట్టి అడిగాడు.

''ఏం మీరలా అనుకోవటం లేదా?'' కనుబొమ్మలెగరేస్తూ అడిగింది డి.ఎమ్.

''తెలివైనవాళ్ళెవరూ అలా అనుకోరు, అందులోనూ ఈ ఊరి సంగతి బాగా తెలిసినవాళ్ళు'' సమీర్ మర్యాదగా అన్నాడు.

''ఏం? ఎందుకని?'' ఈసారి ప్రశ్నించటం అరవింద్ వంతయింది.

''ఎందుకంటే, ప్రస్తుతం మీరు ఒక మతం వారిని ఊరడించి, పరిస్థితి విషమించకుండా చూశారు, ఇంకా రెండోమతం వాళ్ళున్నారు. ఆ పదమూడేళ్ళ పిల్లాడు ఆ మతానికి చెందినవాడు, వాడి మీద మీరు కేసు రాశారు'' అన్నాడు సమీర్.

''అయితే ఏం?'' అని అడిగింది వందన.

''దానివల్ల మతం ప్రమాదంలో చిక్కుకుంటుంది'' అన్నాడు సమీర్ వ్యంగ్యంగా.

''అంటే?'' అడిగింది డి.ఎమ్.

''అంతే ఆ పిల్లవాడి తండ్రి, ఈ కేసు పెట్టింది నా పిల్లవాడిమీద కాదు మొత్తం హిందూ మతం మీద, అన్నాడనుకోండి. అప్పుడు మతం చిక్కుల్లోపడుతుంది. ఇక మన దేశంలో జనాన్ని సందోహపరచాలంటే మతానికి ప్రమాదం వాటిల్లజేయటం కన్నా మంచి ఉపాయం ఏదీ లేదు'' అన్నాడు సమీర్ నిర్లక్ష్యంగా.

''అలా ఏమీ జరగదు ఎస్.పి. గారూ ప్లీజ్, మీరు పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తూ ఉండండి. ఎవరూ పుకార్లు పుట్టించకుండా చూసుకోండి. సమీర్ గారూ, మీరు కూడా కాస్త అప్రమత్తంగా ఉండండి. ఈ ఊరినాడి మీ చేతుల్లోనే కదా ఉండేది'' అని చెప్పి, డి. ఎమ్. కారెక్కి వెళ్ళిపోయింది.

''ఓకే సార్ నేను కూడా ఇక వెళ్తాను'' అని సమీర్ చెయ్యిచాపాడు. ఎస్.పి. ఎంతో ఆప్యాయంగా అతని చెయ్యి ఊపుతూ, ''అలాగేనండీ మీరు కాస్త మా గురించి కూడా పట్టించుకుంటూ ఉండండి'' అన్నాడు.

మర్నాడు ఊళ్ళోవాళ్ళు నిద్రలేచేసరికి, మతం ప్రమాదంలో ఇరుక్కున్నట్టు తెలిపే కరపత్రాలు, అందరికీ అందాయి. కంప్యూటరు ప్రింట్లు తీయించి అందరికీ పంచిపెట్టిన ఆ కరపత్రాల్లో ఉన్న విషయం ఒకటే మతానికి ప్రమాదం వాటిల్లింది దాన్ని కాపాడుకోవలసి ఉంది దానికి అందరూ సంఘటితం కావాల్సి ఉంది.

ఆకాశంలో సూర్యోదయం వేళ కనిపించే కాషాయరంగు త్వరగానే తగ్గింది కానీ అది ఊరంతా వ్యాపించింది. ఊళ్ళో ఎక్కడ చూసినా మెడలో కాషాయ గుడ్డలు వేలాడేసుకున్నవాళ్ళు కనిపించసాగారు. పొద్దెక్కిన కొద్దీ వాళ్ల సంఖ్య కూడా పెరగసాగింది. కరపత్రాల్లో చెప్పిన ఐకమత్యం కోసం రంగ్ దళ్ వాళ్ళు రంగంలోకి దిగారు.

''లేదు సమీర్ మతసమూహాల గురించిన వార్తలు మన ఛానల్‌లో ప్రసారం చెయ్యం'' న్యూస్ ఎడిటర్ ఫోన్‌లో చెప్పాడు.

''కానీ అవధేశ్‌గారూ, ఇక్కడ పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉంది. హిందూ మతాన్ని సమర్థించే ముఠాలు ఊరిని తగలబెట్టేంత ఆవేశంలో ఉన్నారు. వాళ్ళని ఉసికొల్పుతున్నది ఆ పదమూడేళ్ళ పిల్లవాడి తండ్రి'' సమీర్ ఎడిటర్‌ని ఒప్పించటానికి ప్రయత్నించాడు.

''ఏమైనా సరే, మన పాలసీని మార్చుకోలేం. వార్త మత సమూహాలకి సంబంధించినదైతే ప్రసారం చెయ్యం అది మంచి వార్తయినా, చెడు వార్తయినా మన పాలసీ మారదు'' అని ఎడిటర్ స్పష్టంగా చెప్పేశాడు.

''అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?'' అని అడిగాడు సమీర్.

''మీరు పరిస్థితిని గమనిస్తూ ఉండండి. ఏం జరిగినా మాకు వెంటనే తెలియజేయండి'' అన్నాడు

ఎడిటర్.

"సరే అయితే, నేను ఏమైనా జరుగుతుందా అని ఎదురుచూస్తాను" అన్నాడు సమీర్ వ్యంగ్యంగా ఫోన్ కట్ చేసేశాడు.

ఇంట్లో అతను కిటికీలోంచి బైట కాషాయరంగు క్షణక్షణానికీ ఎక్కువవటం చూడసాగాడు. అక్కడక్కడా నినాదాలు కూడా మొదలయ్యాయి. ఇంతలో సమీర్ అన్న కొడుకు పన్నెండేళ్లవాడు వచ్చి "బాబాయ్ నువ్వక్కడికి వెళ్ళటం లేదా?" అని అడిగాడు. "అప్పుడే కాదులేరా, ఏవైనా గొడవలు జరిగితే వెళ్తాను" అన్నాడు సమీర్.

కిటికీ పక్కగా వెళ్తున్న ఒక రంగ్ దళ్ కార్యకర్తని ఆపి సమీర్ "ఏమోయ్ ఏం జరుగుతోంది?" అని అడిగాడు. అతను సమీర్‌కి బాగా తెలిసినవాడు.

"పెద్దబజారులో మధ్యాహ్నం పన్నెండు గంటలకి సమావేశమవుతున్నాం తరవాత ఏం చెయ్యాలో అక్కడా నిర్ణయిస్తాం" అన్నాడా వ్యక్తి.

"ఆ తరవాత ఏం చెయ్యాలో ఈ పాటికి నిర్ణయించుకుని ఉంటారుగా?" సమీర్ సమాధానం రాబట్టాలని ప్రయత్నించాడు.

"ఇంకా ఏమీ నిర్ణయం కాలేదు. పెద్ద బజారు నించి కలెక్టరేట్ దాకా ఊరేగింపు ఉంది. ఘెరావ్ చేస్తామో లేదో ఇంకా తేల్చుకోలేదు" అన్నాడతను.

"ర్యాలీలో సుమారుగా ఎంతమంది ఉంటారు?" సమీర్ అతన్ని వదిలిపెట్టదల్చుకోలేదు.

"మూడు నాలుగువేలమందన్నా ఉంటారు. మేము దీన్ని రాజకీయం చెయ్యబోవటంలేదు. మేం చెప్పేది ఒకటే, ముస్లిముల కోరికపై పదమూడేళ్ళ పిల్లవాడి మీద సెక్షన్ 302 పెట్టటం హిందువులందర్నీ అవమానించినట్టే అని అనుకునే వాళ్ళందరూ ఈ ర్యాలీలో పాల్గొనవచ్చు" ఈ మాటలంటున్నప్పుడు అతని మొహంలో కొద్దిగా ఉద్రిక్తత కనబడింది.

"కవర్ చెయ్యటానికి మీరు రావటం లేదా?" అతనే మళ్ళీ అడిగాడు.

"ఇదుగో బైలుదేరుతున్నాను! మీరు పదండి" అన్నాడు సమీర్ నవ్వుతూ.

అతనటు వెళ్లగానే సమీర్ జోళ్ళు తొడుక్కుని తయారవసాగాడు. "వెళ్లక తప్పదు, కానీ పెద్ద బజారు వాతావరణం అట్టుడికిపోతోంది, ఎప్పుడేం జరుగుతోందో తెలీదు" అనుకున్నాడు.


పెద్దబజారులో కొన్ని వేలమంది గుమిగూడారు. అందరి మెడల్లోనూ కాషాయ వస్త్రాలే! అందరి మొహాల్లోనూ ఆందోళన, ఉద్రిక్తత. కొందరు యువకులు నినాదాలు కూడా చేస్తున్నారు.

"వాళ్ళు కూడా సత్రం దగ్గర గుమిగూడుతున్నారని విన్నాను" అన్నాడు ఒక యువకుడు సమీర్ దగ్గరకొచ్చి.

"వాళ్ళంటే ఎవరు?" తెలిసినప్పటికీ సమీర్ అమాయకంగా అడిగాడు.

"ఆ వెధవలే. ఇంకా వాళ్లపగ చల్లారినట్టులేదు! పదమూడేళ్ళ పసివాణ్ణి ఇందులో ఇరికించినా ఇంకా తృప్తి లేనట్టుంది, దరిద్రపు వెధవలకి!" ఆ యువకుడు మాట్లాడుతూంటే నోటినుంచి తనకి బాగా తెలిసిన వాసన వచ్చింది. సమీర్ జవాబు చెప్పకుండా అతని వీపు తట్టి ముందుకి సాగిపోయాడు.

ఒక దినపత్రిక సబ్‌ఎడిటర్ ఒక ఇంటిముందున్న అరుగుమీదికెక్కి అక్కడున్న వాళ్ళతో, "చూడండి మనమో నిర్ణయం తీసుకున్నాం. మనం జరిగిన దానికి ప్రతికూలంగా ప్రదర్శన చేద్దాం. సన్నీ మీది కేసు వాపసుతీసుకునే వరకూ కలెక్టరేటు ముందు నించి కదిలేది లేదని తెలియజేద్దాం. గుర్తుంచుకోండి, నిన్న వాళ్ళు చేసినట్టే మనం కూడా చెయ్యాలి. వాళ్ళు గవర్నమెంటు మీద ఒత్తిడి తీసుకొచ్చి సన్నీమీద కేసుపెట్టారు, ఒత్తిడి తీసుకురావటం మనకి మాత్రం చేతకాదా? ఇది పిల్లవాడికి సంబంధించిన సమస్య కాదు, మతానికి సంబంధించిన సమస్య ఇవాళ ఈ విషయానికి ఒత్తిడి తీసుకొచ్చినవాళ్ళు ఇకముందు కూడా అదే విధంగా పని సాధించుకుంటారు. వాళ్ళ పద్ధతిలోనే వెంటనే వాళ్ళకి మనం జవాబుచెప్పాల్సి ఉంటుంది. అదే మనకి మంచిది" అన్నాడు. సమీర్ అక్కడ పక్కగా




ఉన్న స్కూటర్ మీద కూర్చుని ఈ మాటల్ని నోట్ చేసుకోసాగాడు.

"నమస్కారమండీ!" గొతువిని సమీర్ తలెత్తి చూశాడు. సన్నీ వాళ్ళ చిన్నాన్న సునీల్. అతను కూడా పత్రికా విలేకరే. రాజధానిలో అచ్చయ్యే ఏదో ఊరూపేరూలేని వార్తపత్రిక పాతిక కాపీలుకొని ఊళ్ళో ఉచితంగా పంచిపెడతాడు. ఆ పాతికకాపీలు కొన్నందుకు అతనికి 'విలేకరి' అనే కార్డు ఇచ్చారు ఆ పత్రికవాళ్ళు.

"ఆc,సునీల్? ఏమిటి విశేషాలు? ఎలాఉన్నావ్" అన్నాడు సమీర్.

"ఏదో ఉన్నాలెండి! నేనసలిక్కడికి రావాలనుకోలేదు. కానీ విలేకరినిగా, రాకతప్పలేదు" అన్నాడు సునీల్.

"అయితే నువ్విక్కడికి సన్నీ చిన్నాన్నగా రాలేదన్నమాట!" సమీర్ నవ్వుతూ అడిగాడు

సునీల్ జవాబు చెప్పేంతలో కాషాయదుస్తుల్లో ఉన్న ఒక కుర్రాడు అక్కడికి వచ్చి, "సునీల్‌గారూ! బ్యానరువాడు డబ్బులివ్వకపోతే బ్యానర్ ఇవ్వనంటున్నాడు" అన్నాడు సునీల్ వాడికి జేబులోంచి డబ్బుతీసిచ్చాడు కుర్రాడు వెళ్ళిపోయాడు.

"ఆc, మీరేదో అడుగుతున్నారు?" అన్నాడు సునీల్

"అబ్బే, ఏంలేదులే!"అన్నాడు సమీర్ నవ్వుతూ.

"కాస్త కవరేజ్ బాగా వచ్చేట్టు చూడండి, సార్! టీవీలో వస్తే గవర్నమెంటు మీద ఒత్తిడి బాగా పడుతుంది" అన్నాడు సునీల్ బతిమాలుతున్నట్టు

"దాన్ని గురించి నువ్వేంవిచారించకు" అన్నాడు సమీర్.

జనం గుంపుగా ముందుకి కదిలారు. సమీర్ సునీల్‌కి వెళ్ళమన్నట్టు సంజ్ఞచేసి, తనుకూడా వాళ్ల వెంట కదిలాడు. దారిపొడుగునా ఏదో ఒక 'కాషాయం' సునీల్ దగ్గరకొచ్చి అతని చెవిలో ఏదో గొణగటం, సునీల్ తన జేబులోంచి డబ్బులు తీసి ఆ 'కాషాయాని'కివ్వటం సమీర్ చూస్తూనే ఉన్నాడు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గుంపు కలెక్టరేట్‌కి బైలుదేరింది. సెల్‌ఫోన్ వైబ్రేట్ అవటంతో సమీర్ దాన్ని తీసి చూశాడు. ఢిల్లీలోని తన ఛానల్ ఆఫీసునించి ఫోన్. అతను నడకవేగం తగ్గించి, "హలో" అన్నాడు. "చెప్పు సమీర్, అక్కడి పరిస్థితి ఎలా ఉంది?" న్యూస్ ఎడిటర్ అవధేశ్ ఫోన్‌లో అడిగాడు.

"ఇప్పటి వరకూ ఏమీ జరగలేదు అవధేశ్‌గారూ కానీ వీళ్ళ నినాదాలు చూస్తూంటే ఏదో ఒకటి తప్పక జరుగుతుందనే అనిపిస్తోంది" తన గొంతులో పలుకుతున్న వ్యంగ్యాన్ని వినపడనివ్వకుండా అన్నాడు సమీర్.

"అనిపిస్తోంది, అంటే?" అడిగాడు ఎడిటర్.

"అంటే మీకు కావల్సిన వార్తలు పంపించగలననే అనిపిస్తోంది. అటువంటి సూచనలు కనిపిస్తున్నాయి!" అన్నాడు సమీర్.

"సరే అయితే నేనిక్కడ సాయంత్రం నాలుగు దాకా ఉంటాను. ఆఫీసు ఫోను బిజీగా ఉంటే, నా సెల్‌కి ఫోన్ చెయ్యండి. అక్కడేవైనా గొడవలు జరిగి

ఇంకో ఛానల్‌వాళ్ళు ముందుగా 'ఫ్లాష్' చూపించెయ్యకూడదు కదా!'' అన్నాడు ఎడిటర్.

తన మనసులో ఎగసిపడుతున్న భావాల్ని అణిచిపెడుతూ సమీర్, ''అలాగే!'' అని ఫోన్ కట్ చేశాడు.

గుంపు కలెక్టరేట్‌కి చేరుకుంది. నినాదాలు ఇంకా ఎక్కువగా జోరుగా వినబడుతున్నాయి. వందనా, అరవింద్ కుమార్ పెద్ద పోలీసుబలగంతో మెయిన్‌గేట్ లోపల నిలబడి ఉండటం సమీర్ చూశాడు. గేట్ మూసేసి ఉంది. గేటు బైట కూడా చాలామంది పోలీసులున్నారు.

డి.ఎస్.పి. జనాన్ని గొడవచెయ్యద్దని వారిస్తూ ''మీలో ఎవరైనా నలుగురైదుగురు మేడమ్ దగ్గరకెళ్ళి మాట్లాడచ్చు'' అన్నాడు.

''ఏం? వాళ్ళతో మాట్లాడటానికి ఆవిడే శవాల దగ్గర కెళ్ళిందిగా? మేమే పాపం చేసుకున్నాం?'' ఒక కాషాయ నాయకుడు కోపంగా అడిగాడు.

''చూడండీ, మేడమ్ మీ కోసమే ఇంతదూరం వచ్చారు. ప్లీజ్ వెళ్ళి మీరు చెప్పదల్చుకున్నది ఆవిడకి చెప్పండి'' అన్నాడు డి.ఎస్.పీ. వాళ్ళని బతిమాలుకుంటున్నట్టుగా.

''సరే, పదండి...'' అంటూ కొందరు మెయిన్‌గేట్‌కేసి నడచారు. గుంపు గేటుని చుట్టుముట్టినట్టుగా నిలబడింది. సమీర్ కూడా గేటు దగ్గరకి వెళ్ళామని ప్రయత్నించాడు, కానీ గుంపు మధ్యన చిక్కుకుపోయాడు. కొద్దిసేపట్లోనే మాట్లాడటానికని వెళ్ళినవాళ్ళు సణుక్కుంటూ, చేతులు తిప్పుతూ వెనక్కి వచ్చేశారు.

''సోదరులారా! జిల్లా సర్కారు సన్నీమీది కేసు వాపసు తీసుకోవటానికి ఒప్పుకోలేదు. అందుచేత ఇక మనం ఘెరావ్ చేసి ఉద్యమం చేపట్టక తప్పటంలేదు. ఆ మార్గాన్నే ఎంచుకోవలసి వస్తోంది!''

సమీర్‌కి వినిపించినది అంతే. ఆ తరవాత మాటల్ని నినాదాలు మింగేశాయి. కొందరు పరిగెత్తుకెళ్ళి కలెక్టరేట్ గేటుకి వేళ్ళాడసాగారు. గేటుని అదేపనిగా ఊపసాగారు. పోలీసులు లాఠీచార్జ్ ప్రారంభించేసరికి సమీర్ అక్కణ్ణించి దూరంగా పోయినిలబడ్డాడు. సెల్‌ఫోన్‌లో అవధేశ్‌కి సమాచారాన్ని అందించసాగాడు. ఫోన్‌లో మాట్లాడటం అయాక చూస్తే, జనం చెల్లాచెదరైపోయి కనబడ్డారు. మళ్ళీ సెల్‌ఫోన్ వైబ్రేటయింది. ఈసారి ఫోన్ సమాచార విభాగం నించి వచ్చింది, ''సమీర్ గారూ! మేము కాల్‌ని న్యూస్‌రూమ్‌కి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. న్యూస్‌రీడర్ అఖ్‌లాఖ్ మిమ్మల్ని ప్రశ్నలు అడుగుతారు!'' ఆ తరవాత అఖ్‌లాఖ్ గొంతు వినబడింది ''చెప్పండి, అక్కడ పరిస్థితి ఎలా ఉంది?''

నిజం అనేది చాలా విచిత్రమైంది. అది పూర్తిగా నగ్నంగా ఉన్నప్పుడు చూడటానికి అసహ్యంగా ఉంటుంది. అబద్ధం తాలూకు ముక్కలు దానిమీద అక్కడక్కడా అతుక్కుని ఉన్నంతసేపూ అందరికీ అది నచ్చుతుంది. కానీ వాటిని తొలగిస్తే, అంతకుముందు మెచ్చుకున్న వాళ్ళే పెద్ద గొడవ లేవదీస్తారు.

''దాదాపు రెండువేలమంది ఊరేగింపులో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ కలెక్టరేట్ దగ్గరొచ్చి నినాదాలు చేశారు. కొందరు కలెక్టర్‌తో మాటలు జరిపారు. కలెక్టర్ సన్నీమీది కేసు వాపసు తీసుకోలేమని చెప్పటంతో, జనం కలెక్టరేట్‌ని ఘెరావ్ చేశారు. దాంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి జనాన్ని చెల్లాచెదురు చేశారు'' అన్నాడు సమీర్.

''ప్రస్తుతం అక్కడి పరిస్థితి ఏమిటి?''

''ఊళ్ళో ఇంకా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. కానీ కలెక్టరేట్ దగ్గర లాఠీఛార్జ్ జరిగాక మాత్రం అంతా సద్దుమణిగింది'' అన్నాడు సమీర్.

''సమీర్, ఈ ఘెరావ్ హఠాత్తుగా జరిగింది, లేక ముందే ప్లాను వేసుకుని చేశారా?''

''డిమాండ్లు అంగీకరించని పక్షంలో ఘెరావ్ చెయ్యాలని వాళ్ళు ముందే అనుకున్నారు'' అన్నాడు సమీర్.

''సరే సమీర్! మీరు జాగ్రత్తగా అక్కడేం జరుగుతోందో గమనిస్తూ ఉండండి. మేము మీకు ఫోన్‌చేసి కనుక్కుంటూ ఉంటాం'' అని చెప్పి అఖ్‌లాఖ్ ఫోను పెట్టేశాడు.

మరుక్షణం సెల్ మళ్ళీ వైబ్రేటయింది. డి.ఎమ్. వందన ఫోన్, ''సమీర్ గారూ! మీరు అబద్ధాలెందుకు చెబుతున్నారు?'' అందావిడ కోపంగా.

''ఏం చెప్పాను, మేడమ్?'' అని అడిగాడు సమీర్.

''కలెక్టరేట్‌ని ఘెరావ్ చేశారని చెప్పలేదూ?''

''అందులో అబద్ధమేముందండీ?''

''అయితే మీరు ఎప్పుడూ నిజమే చెప్తారా?'' వందన వ్యంగ్యంగా అడిగింది.

''అవునండీ! నేను చేసే ఉద్యోగం అటువంటిదేనని అనుకుంటాను!''

''సరే ఈ రెండువేలమంది మీకెక్కడ కనిపించారు?'' వందన ఈసారి విసుక్కుంది.

''గుంపులోనే ఉన్నారు మేడమ్! ఇంకెక్కడుంటారండీ?'' సమీర్ జవాబు చెప్పగానే ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

ఇల్లు చేరుకుని సమీర్ ఇలా టీవీ ఆన్ చేశాడో లేదో, మళ్ళీ సెల్‌ఫోన్ మోగింది ''హల్లో, సమీర్! ఏమిటయ్యా నువ్వు చేస్తున్న పని?'' అవధేశ్ విసుగ్గా అడిగాడు.

''ఏమయింది, అవధేశ్?'' అని అడిగాడు సమీర్.

''వాళ్ళతో ఫోన్‌లో అలా చెప్పారేమిటి? కలెక్టరాఫీసు దగ్గర ఘెరావయిందని చెప్పావు, మీ డి.ఎమ్. ఏమో అలాంటిదేమీ జరగలేదంటోంది?'' అవధేశ్ అరుస్తున్నట్టుగా అన్నాడు.

''ఆవిడ అలాగే అంటుంది మరి!'' సమీర్ నిర్లక్ష్యంగా అన్నాడు.

''ఘెరావ్ అంటే అసలేమిటో తెలుసా నీకు?'' అవధేశ్ వ్యంగ్యంగా అడిగాడు.

''అవధేశ్, ఘెరావ్ జరిగినమాట నిజం..'' సమీర్ తన మాట ముగించముందే అడ్డొస్తూ ''ఇంక చాల్లెండి! మేము డి.ఎమ్.కి ఫోన్ చేసి అక్కడి పరిస్థితేమిటో స్పష్టంగా తెలుసుకుంటాం'' అన్నాడు అవధేశ్. సమీర్ తన మొబైల్‌ని ఆఫ్ చేసేశాడు.

టీవీలో వందన ఫోటో చూపిస్తున్నారు. ఆమె ఫోన్లో మాట్లాడుతున్న మాటలు టెలికాస్ట్ చేస్తున్నారు. ఊళ్ళో ఎటువంటి గొడవలూ లేవనీ, పరిస్థితి ప్రశాంతంగా ఉందనీ ఆమె అంటోంది. కలెక్టరేట్ దగ్గర ఘెరావ్ లాటిదేదీ జరగలేదనీ, కొంతమంది వచ్చి విజ్ఞప్తి పత్రాలిచ్చారనీ, వాటిగురించి నిర్ణయాలు తీసుకోవలసి ఉందనీ చెపుతోంది.

టీవీ ఆఫ్ చేసి సమీర్ కిటికీ దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. కొట్లన్నీ మూసి ఉన్నాయి. అంతటా నిశ్శబ్దం అలుముకుంది. డి.ఎమ్. కొద్దిక్షణాల క్రితం చెప్పినట్టు 'అంతా ప్రశాంతంగా ఉంది!' నిజం అనేది చాలా విచిత్రమైంది. అది పూర్తిగా నగ్నంగా ఉన్నప్పుడు చూడటానికి అసహ్యంగా ఉంటుంది. అబద్ధం తాలూకు ముక్కలు దానిమీద అక్కడక్కడా అతుక్కుని ఉన్నంతసేపూ అందరికీ అది నచ్చుతుంది. కానీ వాటిని తొలగిస్తే, అంతకుముందు మెచ్చుకున్న వాళ్ళే పెద్ద గొడవ లేవదీస్తారు. చాలాసేపు సమీర్ అక్కడే నిలబడ్డాడు, ప్రశాంతత తాలూకు భయాన్ని అనుభవిస్తూ! పట్టపగలే ఇంత నిశ్శబ్దం ఆవరిస్తే అది ఒక రకమైన భయాందోళనల్ని కలిగిస్తుంది. మళ్ళీ లోపలికొచ్చి టీవీ ఆన్ చేశాడు. ఈసారి ఎస్.పి. అరవింద్ మాట్లాడుతున్నాడు, అతను చెప్పేది కూడా ఊరంతా ప్రశాంతంగా ఉందనే. కలెక్టరేట్ దగ్గర ఘెరావ్‌లూ, గొడవలూ, పోలీసు లాఠీచార్జ్ లాటివేమీ జరగలేదని అంటున్నాడు.

సమీర్‌కి జనం నాలుగుపక్కల్నించీ తనని చుట్టుముడుతున్నట్టు అనిపించింది. వాళ్ళలో కొందరు కాషాయం రంగు బట్టలూ, ఇంకొందరు పచ్చరంగు బట్టలూ వేసుకున్నారు. ఇంకో పక్కనించి వచ్చే గుంపు పూర్తిగా ఖాకీ రంగు బట్టల్లో ఉంది. ఈ గుంపు అతన్ని ఘెరావ్ చెయ్యసాగింది. అందరూ తమతమ దుస్తుల రంగుబట్టి నినాదాలు చేస్తున్నారు. అందరి పిడికిళ్ళూ బిగిసి ఉన్నాయి, మొహాలు ముడుచుకుని ఉన్నాయి. సమీర్ సెల్‌ఫోన్‌ని మళ్ళీ ఆన్ చేశాడు. దాన్ని బల్లమీద పెట్టాడు. ఛానల్ హెడ్ ఆఫీసునించి వచ్చే ఫోన్ కోసం ఎదురు చూడసాగాడు. ఆ ఫోన్ ఏమిటో అతనికి తెలుసు, ''మిస్టర్ సమీర్! యు ఆర్ ఫయర్డ్'' ఘెరావ్ ముగిసిపోయింది, ఊరంతా ఇంకా ప్రశాంతంగానే ఉంది.

★